
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 19 జనవరి 2023

5

తూర్పుగోదావరి



కార్టూనిస్ట్ శేఖర్‌కు తానా పురస్కారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) సంస్థ తెలుగు - భాష సంస్కృతి అనే అంశంపై అంతర్జాతీయ స్థాయిలో కార్టున్ పోటీలను నిర్వహించింది. ఈ పోటీల్లో రాజహేంద్రవరం నగరానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ శేఖర్‌కు ఉత్తమ కార్టూన్ విభాగంలో బహుమతి లభించింది. ఈనెల 22న విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో నగదు పురస్కారంతోపాటు ప్రశంసా పత్రాన్ని తానా అందజేయనుంది.



కాసులు కురిపిస్తున్న ఆర్‌టిసి కార్గో

- డోర్ డెలివరీలో తూర్పు ప్రథమం
- విస్తృతంగా ఆర్‌టిసి కార్గో సేవలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎపిఎస్ఆర్‌టిసి కార్గో సేవలు కాసులు కురిపిస్తున్నాయి. ఈ సేవలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో రాష్ట్రంలోనే తూర్పు గోదావరి జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. ఆర్‌టిసి సేవలపై ప్రజల్లో ఉన్న నమ్మకమే ఈ విజయానికి కారణమని అధికారులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా సురక్షిత ప్రయాణంలోనే కాక సరుకు రవాణాలో కూడా ఈ సంస్థ ముందంజలో నిలిచింది. నిర్ణీత కాలంలో సరుకులు ఎగుమతి దిగుమతుల సేవలందిస్తూ రోజురోజుకూ ప్రజల విశ్వాసాన్ని పొందుతోంది. ఒక వైపు ఆదాయం మరోవైపు సేవలు రెండింటిలోనూ మరే జిల్లా అందులో లేని విధంగా మన జిల్లా అగ్రస్థానంలో ఉంది. కోవిడ్ మొదటి, రెండో దశ సమయాల్లో ప్రజా రవాణా దాదాపుగా నిలిచిపోయింది. ఈ తరుణంలో ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా కార్గో పార్సెల్ సేవలపై దృష్టి సారించి పరిధిని విస్తతం చేయడం ఆర్‌టిసికి కలిసొచ్చింది. 2016 మేలో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభమయ్యాయి. అప్పటివరకు ఎఎన్ఎల్ పేరుతో ప్రైవేట్ సేవలు ఉండేవి. ప్రారంభం నుంచే ఆర్‌టిసి కార్గో సేవలు దశలవారీగా మరింత విస్తతం చేస్తూ వస్తోంది. గతేడాది నుంచి ప్రారంభించిన డోర్ డెలివరీ విధానంతో సరుకు రవాణా రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ సౌకర్యం అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మరింత ఆదాయాన్ని పొందుతుంది.

డోర్ డెలివరీ సేవల్లో టాప్

ప్రజా రవాణాలో ముందున్న ఆర్‌టిసి కార్గో సర్వీస్ అందించడంతోపాటు డోర్ డెలివరీ సేవలందించి గతేడాది నుంచి మరో అడుగు ముందుకేసింది. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి నెలకి 3000లకు పైగా డెలివరీలు అందిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. గతేడాది జులైలో అత్యధికంగా 7000 డెలివరీలు అందజేశారు. జిల్లావ్యాప్తంగా విస్తతమైన నెట్వర్క్ ఉండడంతో మారుమూల మండలానికి కూడా జిల్లాలోని డిపోల ద్వారా పార్శిల్స్‌ను నిర్దేశించిన సమయం లోపు చేరవేస్తున్నారు. డోర్ డెలివరీ అందుబాటులోకి వచ్చాక ఏమాత్రం శ్రమ లేకుండా వినియోగదారుల ఇంటికి చేరుస్తున్నారు. సెప్టెంబర్ నెల నుంచి జిల్లాలో ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా నుంచి ఏలూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు, ఒంగోలు, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, కడప, అనంతపురం నగరాలకు పార్సెల్ డోర్ డెలివరీ చేస్తోంది. తొలుత 10 కిలోల బరువు ఉన్న పార్సిల్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించి గతేడాది అక్టోబర్ 1 నుంచి 50 కిలోల వరకు అనుమతించింది. ఫలితంగా కార్గో సేవలు విస్తతమయ్యాయి. జిల్లాలో పార్సిల్ బుక్ చేసిన ప్రాంతం నుంచి ఇతర జిల్లాలోని నగరాలకు 24 గంటల వ్యవధిలో నిర్దేశించిన ప్రాంతానికి డెలివరీ జరుగుతోంది. ఈ సర్వీసులు అందించటంతో రాష్ట్రంలో జిల్లాకు తొలి స్థానం లభించింది.

రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లా ముందంజ

ఉమ్మడి జిల్లాలో రెండేళ్లగా రోజువారీగా 3000లకు పైగా బుకింగ్‌లు, 2000లకు పైగా డెలివరీలతో రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా తనదైన స్థానం సొంతం చేసుకుంది. కరోనా కారణంగా ప్రజా రవాణా తగ్గుముఖం పట్టడంతో ఆర్‌టిసికి ఆదాయం తగ్గిన విషయం విదితమే. అయితే పార్సెల్ సర్వీస్ ద్వారా 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.11 కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.13.50 కోట్ల ఆదాయం లభించింది. గత ఆర్థిక సంవత్సరం 2021-22లో రూ.17.50 కోట్ల లక్ష్యం తీసుకుని అధిగమించింది. ఈ ఏడాది కొత్తగా ఏర్పడిన జిల్లాలో ప్రతి నెలా రూ.కోటి లక్ష్యం తీసుకున్నారు. గత నెలలో రూ.79 లక్షల ఆదాయాన్ని సాధించారు. జిల్లా నుంచి విజయవాడ, విశాఖపట్నంతో పాటు హైదరాబాద్‌కు అత్యధికంగా పార్సిల్స్ బుక్ అవుతున్నాయని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. కొబ్బరి ఉత్పత్తులు, కాయిర్స్, కూరగాయల పంటలు, తుని నుంచి తమలపాకులు, రావులపాలెం నుంచి అరటి గెలలు, ఆకులు, రాజమహేంద్రవరంలో రిటైల్ వ్యాపారులకు నిత్యం సరుకు రవాణా ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం కేంద్రంగా అత్యధికంగా పార్సిల్స్ ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయని అధికారులు గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లావ్యాప్తంగా విస్తృతంగా సేవలు

ప్రజా రవాణాతో పాటు కార్గో సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చాము. జిల్లాలో వ్యవసాయ ఉత్పత్తులతో పాటు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు రైతు భరోసా కేంద్రాలకు ఎపి సీడ్స్ ఉత్పత్తులు విద్యా కానుకలు, ఇఎస్ఐ హాస్పిటల్‌కు సంబంధించిన మందులను క్షేత్ర స్థాయికి కేంద్రాలకు తీసుకెళ్లడంలో ఆర్‌టిసి కార్గో కీలక భూమిక పోషిస్తోంది. ప్రజలకు ఎపిఎస్ఆర్‌టిసిపై ఉన్న నమ్మకమే ఈ విజయానికి కారణం. ఈ ఘనత సాధించటానికి అధికారులు, సూపర్‌వైజర్లు, ట్రాఫిక్ సిబ్బంది, కార్గో సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్ల కృషి ఎంతో ఉంది. రాబోయే రోజుల్లోనూ వినియోగదారులు ఉత్తమ సేవలు అందించి గణనీయంగా ఆదాయం పెంచుకుంటాము.

షర్మిల అశోక, జిల్లా ప్రజా రవాణా అధికారి, ఎపిఎస్ఆర్‌టిసి తూర్పుగోదావరి జిల్లా.

అందుబాటులో డిజిటల్ చెల్లింపులు

ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలకోసం డిజిటల్ చెల్లింపులను కూడా అందుబాటులోకి తీసుకు వచ్చాము. రాజమహేంద్రవరం, రావులపాలెం, అమలాపురం, తుని రామచంద్రాపురం డిపోలలో ఫోన్ పే ద్వారా నగదు చెల్లించే అవకాశం ఉంది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎపిఎస్ఆర్‌టిసి లాజిస్టిక్స్ ఎటిబి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనుమతి పొందిన వారు ఆర్‌టిసి తరపున కార్గో పార్సెల్ బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాము.

-కె.రమేష్, అసిస్టెంట్ కమిషనర్ (కమర్షియల్), ఈస్ట్ గోదావరి రీజియన్, ఎపిఎస్ఆర్‌టిసి.

అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు

హోం శాఖ మంత్రి వనిత



గ్రామస్తులతో మాట్లాడుతున్న మంత్రి వనిత

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందించే విధంగా సిఎం ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. బుధవారం చాగల్లు మండలం గౌరిపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ అన్ని వర్గాలనూ, ప్రాంతాలను దృష్టిలో పెట్టుకుని పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు ఆయా పేద, నిరుపేదల కుటుంబాల, మహిళల ఆర్థిక సాధికారత కోసం నవ రత్నాలు పథకాలను, వైఎస్ఆర్ చేయూత వంటి బృహత్తర పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, కరోనా విపత్తు వచ్చి ఆదాయ వనరులు లేకపోయినా రుణమాఫీ, సున్నా వడ్డీ పథకాలు వంటి పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వైఎస్ఆర్ చేయూత పథకం ద్వారా జీవనోపాధిని ప్రోత్సహించడంలో భాగంగా రిటైల్ వ్యాపార రంగంలో ఉన్న అర్హులైన పేద, నిరుపేద మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నట్లు చెప్పారు. నేడు వారు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోగలిగారంటే జగనన్నకు వారిపై ఉన్న నమ్మకమే కారణం అన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు, నానుడిని సార్థకం చేసే విధానంలో జగనన్న సంకల్పంతో నేడు రాష్ట్రంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా మన్నారు. గత మూడేళ్లుగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ మహిళల ఆర్థిక వెనుక బడిన వర్గాల వారికి కుల మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందిస్తున్నట్లు చెప్పారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, 60 ఏళ్లు నిండితే పెన్షన్ అందిస్తున్నట్లు చెప్పారు. కాపు నేస్తం, రైతు భరోసా, పేదలకు ఇళ్ల స్థలాలు ఇటువంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో రైతులకు సూచనలు, సలహాలు, ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాలూరి హైమావతి, సొసైటీ అధ్యక్షులు ఆత్కూరి దొరయ్య, తహశీల్దారు ఎం.శ్రీనివాసరావు, ఎంపిడిఒ బొలిశెట్టి రామ్‌ప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

8వ రోజుకు పేపర్‌మిల్లు కార్మికుల దీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కార్మిక హక్కులను కాపాడుకుందాం-రక్షించుకుందాం అని పేపర్ మిల్లు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం 8వ రోజుకు చేరాయి. వీరికి మద్దతుగా ప్రయివేట్ హాస్పిటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ మద్దతు తెలిపారు. దేశమంతా సంక్రాంతి సంబరాలు జరుపుకుంటుంటే ఎపి పేపర్ మిల్లు కార్మికులు తమ న్యాయమైన కోరికల కోసం నిరాహారదీక్ష దీక్షలు చేయడం యాజమాన్య నిరకుశవైఖరిని తెలియజేస్తుందన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి ప్రయివేట్ హాస్పిటల్స్ ఎంప్లాయిస్ యూనియన్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. ఈ రోజు నిరాహార దీక్షలో కె.శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాస్, ఆర్.సత్యనారాయణ, సిహెచ్ఎస్‌వి.ప్రసాద్, ఎస్.సత్తిబాబు, కెఎ.కొండయ్య నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమరాజు మద్దతు తెలిపారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన పీడీ



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ రామ్ గోపాల్

ప్రజాశక్తి- గోకవరం

మండలంలోని కామరాజుపేటలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పీడీ జిఎస్ రామ్ గోపాల్ పరిశీలించారు. ఎపిఒ అప్పలరాజు ఆధ్వర్యంలో ఎర్రమ్మ ట్యాంకు పనిని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఉపాధి హామీ పథకం వేతనదారులతో సమీక్ష నిర్వహించి ఉపాధి హామీ పనులను విస్తతంగా ఉపయోగించుకోవాలని వేతనదారులను కోరారు. వారికి రావాల్సిన వేతనాలు బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు తీరుపై సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో మండల స్థాయిలో నిర్వహించాల్సిన రిజిస్టర్లు, వర్కు ఫైళ్లను తనిఖీ చేసి సిబ్బంది సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెఇ అమూల్య రత్నరాజు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి-పెరవలి

మండలంలో ఖండవల్లికి చెందిన కంతేటి దుర్గామల్లేశ్వరరావు (24) మంగళవారం అర్ధరాత్రి మనస్తాపంతో ఉరేసుకుని మరణించాడు. మల్లేశ్వరరావు వ్యవసాయ కూలీ. తల్లిదండ్రులు అనారోగ్యంతో మరణించడంతో ఎవరూ లేనందున ఒంటరి జీవితంపై విరక్తి చెందాడు. మద్యానికి బానిస కావడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ తెలిపారు.

దాత రాధాకృష్ణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-కడియం

రైతు నాయకుడు, ప్రముఖ దాత తోకల రాధాకృష్ణ మతి తీరని లోటని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. మండలంలోని దుళ్ల గ్రామంలో ఇటీవల మృతి చెందిన తోకల రాధాకృష్ణ కుటుంబాన్ని బుధవారం గోరంట్ల పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి గుప్త దానాలు చేసిన మహోన్నత వ్యక్తి రాధాకృష్ణ ఎందరికో ఆదర్శం అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. రాధాకష్ణ కుమారులు తోకల వీర వెంకటరావు, ఆయన కుటుంబ సభ్యులకు తన సంతాపం తెలిపారు. పరామర్శించిన వారిలో కడియం మండల పరిషత్ అధ్యక్షులు వెలుగుబంటి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని, స్థానిక నాయకులు ముమ్మిడి దేవి పాల్గొన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

కర్నూలు జిల్లాలో ఈ నెల 23 నుండి 25 తేదీ వరకు జరగనున్న అంతర్ జిల్లా వాలీబాల్ పోటీలకు తాళ్లపూడి మండలం మలకపల్లి జడ్.పి.హెచ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సిహెచ్.నాగేంద్ర తెలిపారు. పీడీ మనోజ్ఞ శిక్షణలో అండర్ 19 విభాగంలో భావన రవితేజ, అండర్ 14 విభాగంలో కొండే రాము ఎంపికయ్యారని నాగేంద్ర తెలిపారు. వీరు వాలీబాల్ పోటీలలో విజేతలుగా నిలిచి పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఒబా నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

వైద్య విద్యార్థినికి సాయం

ప్రజాశక్తి-కొవ్వూరు రూరల్

పేద పిల్లలకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహకారం అందించడమే ధ్యేయంగా జొన్నలగడ్డ చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి తెలిపారు. ఇటీవల ఒంగోలు వైద్య కళాశాలలో వైద్య విద్య అభ్యసిస్తున్న కొవ్వూరుకు చెందిన మనేపల్లి దేవీ ప్రసన్నకు వైద్య విద్య పూర్తయ్యేవరకు అయ్యే ఖర్చులు తమ ట్రస్ట్ ద్వారా చెల్లిస్తామని సుబ్బరాయ చౌదరి తెలిపారు. బుధవారం దేవీ ప్రసన్నకు రూ.50 వేల సాయం అందజేశారు.

గోదావరి పరిరక్షణ కమిటీ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం

గోదావరి పరిరక్షణ కమిటీ నూతన కార్యవర్గాన్ని టికె.విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ 46 రోజులపాటు తాను చేసిన రిలే దీక్షలకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. ప్రెసిడెంట్‌గా టికె.విశ్వేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా సర్రే కొండబాబు, సెక్రటరీగా కానుబోయిన సాగర్, ట్రెజరీగా పినిశెట్టి సుబ్బరాజు, సభ్యులుగా చంద్రు వీరభద్రరావు, ఎస్.అప్పారావు, బి.అప్పారావు, ఎస్‌విపి.రెడ్డి నుంచి జాల నటరాజ్, డాక్టర్ రాజశేఖర్, ప్రకాష్, శ్రీధర్, వెలమ లక్ష్మణరావుతో ఏర్పాటైన నూతన కార్యవర్గం కలెక్టర్‌తో సమావేశం కానున్నట్లు తెలిపారు.

24 వరకూ రహదారి భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జనవరి 18 నుంచి 24 వరకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ రహదారి భద్రతపై కనీస అవగాహన అవసరమని కలెక్టర్ మాధవీలత అన్నారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా కరపత్రాలు, పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను 2023 జనవరి 18 నుంచి 24వరకు నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. రహదారి భద్రతా విషయంలో 'యువశక్తితోనే మార్పు' అనే నినాదంతో ఏడు రోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. యూనివర్సిటీస్, కళాశాలల్లో అవగాహన సదస్సులు, ప్రభుత్వ, ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు రహదారుల్లో తరచుగా సంభవించే ప్రమాదాల నివారణపై సాంకేతిక పరిజ్ఞానంతో అధికారులు, అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డిటిసి కృష్ణారావు, ఎంవిఐ రంగనాయకులు, సంపత్, రామ్ నారాయణ్, అధికారులు శ్రీదేవి, రాదిక, సుమా, సబిత పాల్గొన్నారు.

శ్రీ సత్యదేవా నర్సరీలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-కడియం

సంక్రాంతి పండుగకు దేశ విదేశాల నుంచి సొంతూరుకు వచ్చే వారంతా కడియం నర్సరీలను సందర్శించడం ఆనవాయితీ. వారిని ఆకట్టుకునే విధంగా రైతులు ఈ నర్సరీలను అద్భుతంగా తీర్చిదిద్దుతుంటారు. . సంక్రాంతి సెలవులు ముగియడంతో కుటుంబ సభ్యులతో ఈ నర్సరీలకు వచ్చి ఆనందంగా గడిపి, తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి తిరిగి వారి ఊర్లకు వెళ్లే వారితో నర్సరీలో సందడి వాతావరణం నెలకొంది. కడియపులంక-వీరవరం రోడ్డులోని శ్రీ సత్య దేవా నర్సరీ అధినేతలు పుల్లా చంటి, పుల్లా అబ్బులు ఆధ్వర్యంలో, హైవేకు ఆనుకొని ఉన్న శ్రీ సత్యదేవ నర్సరీ అధినేత పుల్లా చిన్న సత్యనారాయణ ఏర్పాటు చేసిన సంక్రాంతి శుభాకాంక్షల కూర్పు ఆకర్షిస్తోంది.

వేలివెన్నులో పిఎసిఎస్ గొడౌన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతులకు అందించే వివిధ రకాల సేవలను రైతులంతా వినియోగించుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డిసిసిబి చైర్మన్ పివిఎల్.నరసింహ రాజు అన్నారు. మండలంలోని వేలివెన్ను పిఎసిఎస్ ప్రాంగణంలో నిర్మించిన అదనపు గొడౌన్లను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి నందిగం భాస్కర రామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎపిపి పాలాటి యల్లారీశ్వరి, వేలివెన్ను సొసైటీ పర్సన్ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి కృష్ణ, బ్రహ్మానందం, ఎఎంసి చైర్మన్ వెలగన పోలయ్య, అబ్బిన రాంబాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పాలాటి శరత్, సొసైటీ కార్యదర్శి ఏల్చూరి గోపాలకష్ణ, సొసైటీ సభ్యులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్‌టిఆర్‌కు పలువురి ఘన నివాళి



రాజమహేంద్రవరంలో..

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు 27వ వర్ధంతి సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలువురు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరంలో బిసి సాధికార సమితి శెట్టిబలిజ విభాగం రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. లాలా చెరువు సెంటర్‌లో స్వర్ణాంధ్ర వద్ధాశ్రమంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు అన్నదానంలో పాల్గొన్నారు. ఉప్పులూరి జానకి రామయ్య, కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి, మునసా అప్పారావు పాల్గొన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎంఎల్ఎ పెందుర్తి వెంకటేష్ పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సూరిశెట్టి చిన్న, మాజీ జెడ్‌పిటిసి మల్ల అప్పలనర్సారావు మాజీ ఎంపిపిలు బదిరెడ్డి రాజా, బుద్ధ నూకరత్న బాపూజీ, పెనకటి శివాజీ, పశ్చిమ గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీను, తెలగంశెట్టి శ్రీను, అడపా వీరబాబు పాల్గొన్నారు. **నిడదవోలు** పట్టణంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి బూరుగుపల్లి శేషారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. **కొవ్వూరు రూరల్‌లో** కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు. **పెరవలిలో** ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు, సలాది కష్ణమూర్తి ఆర్థిక సహకారంతో పేదలకు, వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. **కడియం** దేవీచౌక్ సెంటర్‌లో వెలుగుబంటి నాని ఆధ్వర్యంలో నివాళు లర్పించారు. ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ పాల్గొన్నారు. **చాగల్లు** ఎన్‌టిఆర్ చౌక్ సెంటర్‌లో టిడిపి పట్టణ అధ్యక్షులు దొంగ రామకృష్ణ, నాదెళ్ల శ్రీరామ చౌదరి, కరుటూరి సతీష్, కోడూరి ప్రసాద్ ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. **తాళ్లపూడి** మలకపల్లిలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి పెద్దేవంలో తిగిరిపల్లి గోపి తదితరులు నివాళులర్పించారు. **దేవరపల్లి** మండలం యర్నగూడెంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. టిడిపి గోపాలపురం ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు.



కొవ్వూరులో..

డ్రెయినేజీ, కల్వర్టులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి ఎస్‌సి కాలనీలో డ్రెయినేజీ, కల్లర్టు నిర్మాణానికి ఎంఎల్ఎ తలారి వెంకటరావు బుధవారం శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సచివాలయానికి రూ.20 లక్షలు, పంచాయతీ నిధుల నుంచి రూ.14.5 లక్షల నిధులతో ఈ నిర్మాణాలకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కుప్పల దుర్గారావు, గ్రామ సర్పంచ్ కడిమి కుమారి, జెడ్‌పిటిసి స్వర్ణలత, నాయకులు పాల్గొన్నారు.

భూ సర్వే డ్రోన్ ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి గ్రామంలోని జగనన్న లేఔట్‌లో బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత భూ సర్వే నిమిత్తం డ్రోన్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రెవెన్యూ రికార్డు వందేళ్ల క్రితం రీ సర్వే రిపోర్ట్ ఆధారంగా భూ సర్వే చేస్తున్నామన్నారు. సబ్ డివిజన్ భూ సర్వే చేసి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు డోన్ ద్వారా గ్రామాల్లో సర్వే చేస్తున్నట్టు చెప్పారు. భూ సమస్యలు రానివ్వకుండా భూ ప్రక్షాళన చేసి ప్రతి ఒక్క రైతు దగ్గర ఉండి వారి రికార్డు పేరు మార్పులు సబ్ డివిజన్ భూ సమస్యలు లేకుండా చూసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఎటువంటి భూ సమస్యల రాకుండా ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. ఒక ఊరు ఒక రోజులో డోన్ ద్వారా సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ పూజారి లక్ష్మణరావు, డివిజనల్ సర్వేయర్ కెవి.రామకృష్ణ, తహశీల్దారు టి.రాజేశ్వరి, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, ఎంపిపి కార్చెర్ల సీతారామ్ ప్రసాద్, పంపన అంజి, అగరత్తి వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

20న మడ అడవుల సంరక్షణపై సదస్సు

- మీడియా పాత్రపై కోరంగి వేదికగా ప్రత్యేక చర్చ

- ఎపి ప్రెస్ అకాడమీ కార్యదర్శి బాలగంగాధర తిలక్

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో మడ అడవుల సంరక్షణ, సామాజిక బాధ్యత-మీడియా పాత్రతో పాటు జర్నలిజం మౌలిక సూత్రాలు, విలువలు అంశాలపై ఈ నెల 20న తాళ్లరేవు మండలం, కోరంగి ఫారెస్ట్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక చర్చ జరగనుందని ప్రెస్ అకాడమీ కార్యదర్శి మామిడిపల్లి బాల గంగాధర తిలక్ బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. కాకినాడ జిల్లా, అటవీ శాఖ సంయుక్త నిర్వహణలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ముమ్మిడివరం ఎంఎల్‌ఎ పొన్నాడ వెంటక సతీష్ కుమార్ అధ్యక్షతన జరగ నుందన్నారు. కార్యక్రమానికి ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, కాకినాడ రూరల్, అర్బన్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్, కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఎస్‌పీ ఎం.రవీంద్ర నాథ్‌బాబు, జిల్లా అటవీశాఖ అధికారి ఇందుకూరి కాశీవిశ్వనాధ రాజు తదిఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. సమస్త ప్రాణికోటి మనుగడకు మూలాధారమైన ప్రకతి సంపద పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జర్న లిస్టులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాలగంగాధర్ తిలక్ కోరారు.

19, 20 తేదీల్లో రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని పర్యటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఈ నెల 19, 20 తేదీల్లో కాకినాడ జిల్లాలో పర్యటిస్తారు. ఆయన 19వ తేదీ రాత్రి 8 గంటలకు కాకినాడ చేరుకుని ఆర్ అండ్‌బి అతిథిగృహంలో బస చేస్తారు. 20వ తేదీ ఉదయం 9.30గంటలకు చొల్లంగి టూరిస్ట్ స్పాట్ ఫెర్రీ పాయిం ట్‌ను సందర్శిస్తారు. అనంతరం కోరంగి అటవీ శాఖ సమావేశ మందిరంలో మడ అడవుల సంరక్షణపై నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కాకినాడ ఆర్‌అండ్‌బీ అతిథిగహానికి చేరుకుని, 4 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

గణపతి శాస్త్రి ఇంట్లో చోరీకి యత్నం

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక కంచి సంస్థానం చైర్మన్, కీ.శే. బ్రహ్మశ్రీ చంద్రభట్ల చింతామణి గణపతి శాస్త్రి ఇంట్లో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి ప్రయత్నించారు. అయితే రాత్రి ఇంటిలో కుటుంబీకుల అలికిడి వినిపించి పరారయ్యారు. స్థానిక కంచి సంస్థానంగా పిలవబడే గణపతి శాస్త్రి గృహంలో దొడ్డి స్థలం వైపున్న గేటుకు గల తాళాలను పగులు కొట్టి గుర్తుతెలియని దుండగులు లోపలికి ప్రవేశించి ఇంటిలోనికి వెళ్లేందుకు మరొక గుమ్మానికి గల తాళాలను ఇనుప రాడ్ల సహాయంతో బద్దలు కొట్టి ఇంటిలోనికి ప్రవేశించే దుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కుటుంబీకుల అలికిడికి ఆ దుండ గులు పరారైనట్లు గణపశాస్త్రి సోదరుడు పతంజలి శాస్త్రి పోలీసులకు వివరించారు. వారు ఇంటిలోకి ప్రవేశించలేదని ఎక్కడి సామగ్రి అక్కడే భద్రంగా ఉందని పతంజలి శాస్త్రి పోలీసులకు వివరించారు. ఆయన ఫిర్యాదు మేరకు స్థానిక సిఐ కె.దుర్గాప్రసాద్, క్రైమ్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాకినాడ నుంచి క్లూస్ టీంను రప్పించి వేలిముద్రలను సేకరించి, దర్యాప్తును వేగవంతం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ దుర్గా ప్రసాద్ తెలిపారు.

గండేపల్లి మండలంలో రెండు చోట్ల చోరీ

ప్రజాశక్తి - గండేపల్లి

గండేపల్లి మండలంలో గండేపల్లి మల్లేపల్లి గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి రెండు చోట్ల చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. గండేపల్లి గ్రామస్తుడైన మామిడిపాక కళ్యాణ్ శ్రీనివాస్ అను అతను తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం వెళ్లగా అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దుండగులు అతని ఇంటిలోకి ప్రవేశించి, బీరువా తాళాలు పగలగొట్టి వారు బీరువాలో దాచుకున్న సుమారు ఐదున్నర కేజీల వెండి వస్తువులు, నాలుగు గ్రాముల బంగారు వస్తువులు, రూ.30 వేలు దోచుకు పోయారు. మల్లేపల్లి గ్రామంలో అడబాల శ్రీనివాస్ ఇంట్లో జరిగిన దొంగతనంలో రూ.10 వేలు, అరకాసు బంగారం చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్ఐ శ్రీ వై గణేష్ కుమార్ కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని క్లూస్ టీం తో. ఎస్ఐ గణేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - గండేపల్లి

రంగంపేట మండలం రంగంపేట గ్రామానికి చెందిన సుక్కిరెడ్డి సాయి సుధాకర్ (50) కుటుంబ సమస్యల వలన ఈనెల 17న రాత్రి 8:30 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికిన సుధాకర్ కనపడలేదు. దీంతో అక్కిరెడ్డి మార్కండేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంపేట ఎస్ఐ టి.రామకష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహారాణి కళాశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి -పెద్దాపురం

పెద్దాపురం మహారాణి కళాశాలలో, శ్రీ వీర్రాజు హై స్కూల్ లో చదువుకుని వివిధ ప్రాంతాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సంక్రాంతికి సొంత ఊరు వచ్చిన సందర్భంలో బుధవారం తాము చదివిన కళాశాలలో, హైస్కూల్ లో కలుసుకుని, ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా మహారాణి కళాశాలలో 2005-08 సంవత్సరంలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు దుర్రాని, వెంకటేష్, జిలాని, సత్యనారాయణ, ఖాన్, మహాపాతిన దేవి తదితరుల ఆధ్వర్యంలో అధ్యాపకులు ఏసుబాబు, గాయత్రి, జీవివి సార్‌లను సన్మానించారు. అలాగే స్థానిక శ్రీ వీర్రాజు స్కూల్లో 1994-95 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు అప్పటి తమ ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, స్టీవెన్సన్, ప్రభావతి, రైటర్ సత్యనారాయణ లను ఘనంగా సన్మానించారు.

114.82 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం వేలం

ప్రజాశక్తి-కరప

కరప మండలం వేళంగిలోని మండల స్థాయి గొడౌన్‌లో జప్తు ద్వారా తరలించి ఉంచిన పిడిఎఫ్ బియ్యాన్ని వేలం వేయనున్నట్టు తహశీల్దార్ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు 114.82 క్వింటాళ్ల పిడిఎఫ్ బియ్యం వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తిగల వారు నిబంధనలను అనుసరించి బియ్యం తనిఖీ చేసుకుని, వారు ఖరీదు చేయు రేటును సీల్డ్ కవర్లో టెండరు రూపంలో ఈ నెల 20వ తేదీలోపు కరప డిప్యూటీ తహశీల్దార్, సివిల్ సప్లైయిస్, వేలం జరుగబోయే గోడౌన్‌లో అందజేయవలసిందిగా కోరారు.



ట్రోఫీని అందిస్తున్న ఎంపిపి భవాని తదితరులు

క్రికెట్ టోర్నీ విజేతకు ట్రోఫీ అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని మాలపాడులో జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత జై భీమ్ జట్టుకు ఎంపిపి అంబటి భవాని చేతుల మీదుగా ట్రోఫీని బుధవారం అందించారు. సర్పంచ్ నేమల సుజనాసంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో 24 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో వైఎస్ఆర్ నగర్‌కు చెందిన జై భీమ్, జట్టు, ఊలపల్లి జట్లు తలపడ్డాయి. జైభీమ్ జట్టు విజేతగా, ఊలపల్లి జట్టు రన్నరప్‌గా నిలిచాయి. జై భీమ్ టీం కెప్టెన్ దుర్గాప్రసాద్ ట్రోఫీని అందుకున్నారు. విజేతలకు ఎంపిపి భవాని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెల్లుబోయిన నరేన్, చోడవరం ఎంపిటిసి సాదే సుభద్రమ్మ, సర్పంచ్ నామల సుజన సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

- జడ్‌పి సర్వసభ్య సమావేశంలో సభ్యులు నిలదీత

- బడ్జెట్ అంచనాలకు ఏకగ్రీవంగా ఆమోదం

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో జెడ్పిటిసీలకు కనీస మర్యాద లేకుండా అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదంటూ పలువురు జడ్‌పిటిసిలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బుధవారం కాకినాడలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘాలు, సర్వ సభ్య సమావేశాలు జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి కమిటీ సమావేశాలు, మనబడి-నాడు నేడు పనులు, నవ రత్నాలు-పేదలందరికీ ఇళ్లు, రహదారుల ఆధునికీకరణ తదితర అంశాలపై సభ్యులు అధికారులను నిలదీశారు.

ముఖ్యంగా ప్రొటోకాల్ విషయంపై జడ్‌పి ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ పట్టుబట్టారు. దీంతో సమావేశం కొంతసేపు రసాభాసగా మారింది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ, విద్యా కమిటీల సమావేశాలకు తమను అధికారులు పిలవడం లేదని ముమ్మిడివరం, ఉప్పలగుప్తం జడ్‌పిటిసి కుడిపూడి శివశంకర్రావు, గెద్దం సంపతిరావులు ఆవేదన వ్యక్తం చేయగా మిగిలిన సభ్యులు కూడా వారికి మద్దతుగా నిలిచారు. క్రింద స్థాయి అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ ఛైర్మన్, అధికారులను నిలదీశారు. దీనిపై ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ప్రొటోకాల్ విషయంపై క్రింది స్థాయి అధికారులు జడ్‌పిటిసీలకు గౌరవం ఇవ్వాలన్నారు. పలు విద్యా రంగ సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు. ఎంఎల్‌సి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ యాప్‌లతో కుస్తీలు పడుతుండడం వలన ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సకాలంలో అందడం లేదన్నారు. ఆర్‌అండ్‌బీ రహదారులు గోతుల వలన ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను జడ్‌పి వైస్ ఛైర్మన్ బుర్రా అనుబాబు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. పిఠాపురం నుంచి సామర్లకోట వెళ్లే రహదారి మరింత అధ్వానంగా మారిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించాల్సిన అవసరం ఉందని చిక్కాల తెలుపగా సమావేశానికి వచ్చే క్రమంలో మీరే దండ పట్టుకుని రావొచ్చు కదా అని ఛైర్మన్ వేణు గోపాలరావు ఎద్దేవా చేశారు. మాజీ ముఖ్యమంత్రికి ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ చిక్కాల ఈ సందర్భంగా అసహనం వ్యక్తం చేశారు.

రూ.1,379 కోట్ల అంచనాలతో బడ్జెట్ కు ఆమోదం

సాధారణ నిధులు, వివిధ గ్రాంట్లతో పాటు వివిధ విభాగాలకు విడుదలయ్యే నిధులను కూడా కలిపి 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.70 లక్షల మిగులుతో రూ.1,379 కోట్ల అంచనాలతో రూపొందించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ బడ్జెట్ అంచనాలను జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో తొలుత యు.కొత్తపల్లి ఎంపిడిఒ నంబూరి ప్రభాకర రామారావు మృతిపై నివాళులు అర్పించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు

అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా జగనన్న విద్యా భారతి పేరుతో జిల్లా ప్రజాపరిషత్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం జడ్‌పి సీఈవో ఎన్‌వివి సత్యనారాయణ బడ్జెట్ సవరణలను, 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను పద్దుల వారీగా సభ్యులకు వివరించారు. అన్ని పద్దులు కలుపుకొని ఆదాయాన్ని రూ. 1,379 కోట్లుగా, వ్యయాన్ని రూ. 1,378.30 కోట్లుగా అంచనా వేసి బడ్జెట్‌ను రూపొందించినట్లు తెలిపారు. గత 2022-23 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్ కింద ఆదాయం రూ.1,229.43 కోట్లు కాగా వ్యయం రూ.1,228.78 కోట్లుగా వివరించారు. వైద్యం, ఆరోగ్యం, రహదారులు, భవనాలు, ఇరిగేషన్, గృహ నిర్మాణం, విద్య తదితర శాఖల పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న కార్యకలాపాలు, వివిధ పథకాలు, కార్యక్రమాల అమల్లో ప్రగతిపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో కాకినాడ, బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు కృతికా శుక్లా, హిమాన్షు శుక్లా, తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, రాజోలు, పిఠాపురం ఎంఎల్‌ఎలు రాపాక వరప్రసాద రావు, పెండెం దొరబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



రామారావు కుటుంబానికి ధైర్యం చెబుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు

ఎంపిడిఒ రామారావు మృతి విచారకరం

ప్రజాశక్తి - కాకినాడ

యు.కొత్తపల్లి మండల ఇన్చార్జ్ ఎంపిడిఒగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎన్‌వీఎస్ రామారావు మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఎంపిడిఒ రామారావు ఈ నెల 16న గుండె పోటు కారణంగా మతి చెందగా బుధవారం మధ్యాహ్నం జడ్‌పి ఛైర్మన్, కలెక్టర్, జడ్‌పి సీఈవో ఎన్‌వీవీ సత్యనారాయణ కాకినాడ గ్రామీణ మండలం, చీడిగలోని రామారావు నివాసానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామారావు భార్యా పిల్లలతో మాట్లాడి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వారు ఎంపీడీవో రామారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారితోపాటు కాకినాడ డిఎల్‌డిఒ పి.నారాయణమూర్తి, జడ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా అభివృద్ధి, సంక్షేమం

- దిశ సమావేశంలో ఎంపి గీత

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధుల సమన్వయంతో జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివద్ధి పథకాల ప్రయోజనాలు లక్ష్మిత వర్గాల ప్రజలకు సమగ్రంగా చేరేలా కషి చేయాలని ఎంపీ వంగా గీత అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. బుధవారం సాయంత్రం జడ్పి సమావేశ హాలులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం ఎంపీ అధ్యక్షతన జరిగింది. జాతీయ ఆరోగ్య మిషన్, ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్, జల జీవన్ మిషన్, స్వచ్ఛభారత్ మిషన్, మధ్యాహ్న భోజన పథకం, స్మార్ట్ సిటీ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, జాతీయ ఆహార భద్రత పథకాల అమలు తీరును కమిటీ సమీక్షించి, అధికారులకు సూచనలు ఆదేశాలు జారీ చేసింది.

తొలుత చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం సమీక్షలో జిల్లాలోని 385 ఆవాసాల్లో ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసే లక్ష్యాన్ని 2024 నాటికి సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికా బద్ధంగా చర్యలు చేపట్టాలని సభ్యులు అధికారులను కోరారు. ముఖ్యంగా గ్రామ శివారులలో ఉండే బడుగు వర్గాల కాలనీలకు తాగునీరు పూర్తి స్థాయిలో సక్రమంగా అందేందుకు ప్రత్యేక పైపులైన్లు, వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఎంపీ అధికారులకు సూచించారు. వచ్చే వేసవిలో ఏ ఆవాసంలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా మందస్తు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులకు సూచించారు. జాతీయ ఆరోగ్య మిషన్‌పై చర్చలో నిర్మాణం పూర్తయిన ఆసుపత్రి భవనాలకు అవసరమైన ఇన్ ఫ్రాస్ట్రక్చర్ కల్పించి ప్రారంభించి ప్రజలకు ఆరోగ్య సేవలు విస్తరించాలన్నారు. ఆసుపత్రులలో



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి గీత

ఇంకా మిగిలి పోయిన సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయా లని, క్రమం తప్పకుండా ఆసుపత్రి అడ్వజరీ కమీటీ సమావేశాలు నిర్వహిం చాలని పలువురు ఎంపిపిలు, మున్సిపల్ కమిషనర్లు కోరారు. వైద్య సిబ్బంది పోస్టుల భర్తీకి ప్రభుత్వ ఆమోదం కొరకు ప్రతిపాదించామని, పూర్తయిన ఆసుపత్రి భవనాలను త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని కలెక్టర్ సభ్యులకు తెలిపారు. మెట్ట మండలాల్లో తరచు కాలిపోతున్న వ్యవసాయ విద్యుత్ సరఫరా ట్రాన్స్‌ఫార్మర్లను జాప్యం లేకుండా పునరుద్ధరించాలని, ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్న పవర్ లైన్లను, చేతికి అందేలా ఉన్న ఫ్యూజ్ బాక్స్‌లను చక్కదిద్దాలని ఎంపిపిలు కోరారు. స్మార్ట్ సిటీ ప్రోజెక్ట్ క్రింద చేపట్టిన పనులకు పెండింగ్ చెల్లింపులు సత్వరం జరిపి ఆయా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఎల్‌సి చిక్కల రామ చంద్రరావు కోరారు. సమావేశంలో జడ్‌పి చైర్మన్ వేణుగోపాలరావు,సిఈఓ ఎన్.వి.వి.సత్యన్నారాయణ, డ్వామా పీడీ ఎ.వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

-ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - అన్నవరం

అన్నవరం శివారు కొత్తపేటలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక బాలుడు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్రంగా గాయాలు అయినట్లు అన్నవరం పోలీసులు తెలిపారు. రౌతులపూడి మండలం ధార జగన్నాధపురం గ్రామానికి చెందిన బర్ల రమణ, భార్య దుర్గ అతని ఇద్దరు మగ పిల్లలు దుర్గాప్రసాద్, గంగరాజులతో కలిసి పత్తిపాడు మండలం పెద్దిపాలెంలో తన అత్తగారి ఇంటికి వెళ్లారు. తిరిగి బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై దారా జగన్నాధపురం వెళు తుండగా అన్నవరం శివారు కొత్తపేట లోని స్నేహ రెసిడెన్సీ వద్దకు వచ్చేసరికి విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్నటువంటి ఆర్‌టిసి బస్సు వెనుక నుండి ఢీకొనడంతో బర్ల రమణ, అతని భార్య దుర్గ రెండో కుమారుడు గంగరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. బర్ల రమణ పెద్ద కుమారుడు దుర్గాప్రసాద్ (6) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన వారిని వెంటనే తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

జగన్ అన్న ఇంటి నిర్మాణానికి ముఖ్యమంత్రి ఇస్తున్న రూ.లక్షా 80 వేలు ఏమాత్రం సరిపోవడం లేదని రూ.5 లక్షలు ఇచ్చి చరిత్రలో నిలిచి పోవాలని లేకుంటే ప్రజలు గుణపాఠం చెపుతారని సిపిఐ జిల్లాకార్యదర్శి తాటిపాక మధు హెచ్చరించారు. బుధవారం సిపిఐ నగర కమిటీ బృందం వెలుగుబందలో జగన్ అన్న కాలనీని పరిశీలించింది అక్కడ లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు విన్నారు. వాళ్ల నుంచి సంతకాలు సేకరించారు. జగనన్న కాలనీ లబ్ధిదారులు ఇళ్ల స్థలం వచ్చినందుకు ఆనందంగా ఉన్నారని కానీ ప్రభుత్వం ఇచ్చే సహాయం ఏ మాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు కట్టుకోవడానికి ఎంత కాదనుకున్నా రూ.3 లక్షల అవుతుందని అదే కొద్దిగా చుట్టూ గోడల ఇల్లు నిర్మాణం చేయాలంటే రూ.ఆరు లక్షలు అవుతుందని చాలామంది మహిళలు చెప్పారు. దీంతో ప్రతి ఇంటి నిర్మాణానికీ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని మధు డిమాండ్ చేశారు. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెపుతారని ఆయన హెచ్చరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కొండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు మాట్లాడుతూ సిపిఐ పోరుబాట నేటి నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతుందని 30న లబ్ధిదారులతో రౌండ్ టేబుల్ సమావేశాలు జరుపుతామని, ఫిబ్రవరి 6న కలెక్టరేట్ వద్ద ధర్నాలు, 22న విజయవాడలో మహాధర్నా చేపడుతున్నామని తెలిపారు. ఈ పర్యటనలో సిపిఐ నగర సహాయ కార్యదర్శి సప్పా రమణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జ్యోతి రాజు, చింతలపూడి సునీల్, యడ్ల లక్ష్మి, నల్లా రామారావు పాల్గొన్నారు.

పలువురికి ఎంఎల్ఎ రాజా పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను ఎంఎల్ఎ జక్కంపూడి రాజా బుధవారం పరామర్శించారు. వైసిపి నేత అయ్యల మాధవరావు తల్లి అయ్యల సత్యవేణి సంవత్సరికంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.ఉప సర్పంచ్ మండపాక గణేశ్వర రావు నాన్నమ్మ మండపాక రాజమణి ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను, రఘుదేవపురంలో కర్రి ఉమామహేశ్వరరావు తల్లి పుల్లమ్మ, యర్రా వెంకటేష్ తండ్రి యర్రా అంజి కుటుంబ సభ్యులను, ఇనగంటి వారి పేటలో కుంచె అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనారోగ్యంతో బాధ పడుతున్న మెండు వీరబాబు, సుంకర నరసింహారావు తమ్ముడు వీరన్న, కూన రామకష్ణను పరామర్శించారు.

వెంకటకృష్ణకు పలివెల అభినందన


ప్రజాశక్తి - సీతానగరం

వైసిపి రాజానగరం నియోజవర్గం బూత్ కమిటీల అధ్యక్షునిగా ఎన్నికైన గద్దె వెంకటకష్ణ చౌదరికి బుధవారం సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వీరబాబు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ వంతు కృషి చేస్తు నియోజకవర్గంలో ప్రజలందరిని కలుపుకోవాలని సూచించారు.

ఎస్ఐ శివప్రసాద్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజలంతా ఆనందంగా పండుగ జరుపుకోవడానికి కృషి చేసిన ఎస్ఐ సోమన శివప్రసాద్ గుమ్మిలేరు సర్పంచి గుణ్ణం రాంబాబు బుధవారం సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎస్ఐ చేసిన కృషి అభినందనీయమన్నారు.



ఎస్ఐను అభినందిస్తున్న రాంబాబు

పేదలకు నిత్యావసరాల పంపిణీ

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని చినకొత్తలంకలోని 15 మంది నిరుపేద కుటుంబాలకు క్షత్రియ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయలు, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, స్వీట్లను బుధవారం పంచారు. క్షత్రియ నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తణుకు వాస్తవ్యులు కనుమూరి వెంకటకృష్ణంరాజు జ్ఞాపకార్ధం ఆయన మనువడు దీపక్ వర్మ సహకారంతో వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన నిధికి రూ.55వేల విరాళం

ప్రజాశక్తి - అయినవిల్లి

అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి మండలంలో వీరవిల్లిపాలేనికి చెందిన రేషన్ డీలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అడపా వెంకటరమణ కుటుంబం అన్నదాన నిధికి రూ.55,074 విరాళంగా అందించింది. వారి కుటుంబం అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ఇఒ సతీష్‌రాజు ఆధ్వర్యంలో శేషవస్త్రములతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఘనంగా గోగులమ్మ జాతర

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని తాడిపర్రులో నెలకొని ఉన్న గ్రామ దేవత గోగులమ్మ జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. 13 ఏళ్ల అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న ఈ జాతరలో గోగులమ్మను గ్రామ వీధులలో మంగళవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మేళ తాళాలతో, బుట్ట బొమ్మలు, బేతాళ నృత్యాలతో ఊరేగించారు. సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు స్వగృహంలో నిర్వహించిన భోజనాల్లో మాజీ ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పాల్గొని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నిడదవోలు నియోజకవర్గ టిడిపి నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ గ్రామంలోని పలువురి ఇళ్ళలో జాతర మహోత్సవంలో పాల్గొన్నారు.